




- ఓలేటి శ్రీనివాసభాను

**త**ల పైకెత్తి చూస్తే తలపాగా జారిపోవాల్సిందే! అంత ఎత్తుగా వున్నాయి నర-నారాయణ పర్వతాలు. వాటి భుజాల మీద వెండి మబ్బులు కండువాల్లాగా వేలాడుతున్నాయి. పర్వతాల బారుల మధ్య పరవళ్లు తొక్కుతోంది అలకనంద. చల్లని గాలి, గోరువెచ్చని ఎండా, నెమలిపింఛంతో చెక్కిలి మీద రాసినట్లుంది బదరీనాథ్ వాతావరణం. అక్కడ బ్రహ్మ కపాలాన్ని ఆనుకుని ఏటవాలు చప్టా మీద బాసింపట్టు వేసుకొని కూర్చున్నాడు అవధాని. అతని ముందు విస్తరి... దాన్నిండా అన్నం పిడచలు... వాటిలోకి పితృదేవతల్ని ఆవాహన చేస్తూ ఓ ఉత్తరాది పండిట్‌జీ మంత్రాలు.

# బ్రహ్మకపాలం

మాతృపిండాన్ని మునివేళ్లతో పైకి తీస్తుంటే అవధాని కళ్లల్లో అలక్‌నందా.... నాన్న సృష్టించిన రాద్ధాంతం...అమ్మలో కట్టలు తెంచుకున్న దుఃఖం. 'రైలు కింద తల పెడతాను' అంటూ ఇంట్లోంచి తను పారిపోయిన వైనం. పిండాన్ని అద్దుకొన్న నల్ల నువ్వుల్లాగా అవధాని మనసును హత్తుకునే వున్నాయి.

***


ఆ సాయంత్రం ఊరి చివరున్న రైల్వేస్టేషన్‌లోకి అవధాని బతుకు మీద విసుగెత్తి నడిచాడు. బలమైన గాలి తోసుకుపోతున్నట్లు నడిచాడు. ప్లాట్‌ఫారమ్మీది ఎర్ర కంకర పాదాల కింద గరగరలాడుతోంది.

''రైలు కింద తల పెడతాను'' అని మళ్లా అనుకున్నాడు అవధాని.

''అవును, ఆలస్యం చేయొద్దు'' మంటని ఎగదోసింది మనసు.

మార్కులే కొలబద్ద అనుకుంటే అవధాని మొద్దబ్బాయే... చదువురాని చవట... ఎస్ఎస్ఎల్‌సీ వరకూ పడుతూ లేస్తూ వచ్చాడు. అత్తెసరు మార్కులతో గట్టెక్కాడు. కానీ ఎస్ఎస్ఎల్‌సీలో మాత్రం మూడు సార్లు డింకీలు కొట్టాడు. మరో రెండు సార్లు పరీక్ష హాల్‌లో ఖాళీ పేపర్ ఇచ్చి, ఇంటికి రావడానికి భయపడ్డాడు. చదువురా.. చదువు... అంటూ చెప్పేవాళ్లుగానీ, ఎలా చదివితే పాసు మార్కులు వస్తాయో చెప్పేవాళ్లు లేరు. ట్యూషన్ చెప్పించే స్తోమత తండ్రికి లేదు. మనిషి ముక్కోపి. ఇంట్లో ఎప్పుడూ అరుపులు, అదిలింపులు అవమానాలు! కష్టపడి చదివిందంతా గాలికెగిరిపోయేది. పరీక్ష హాల్లోకి అడుగుపెట్టగానే అవధాని బుర్ర ఆనపడొల్లలాగా ఖాళీ అయిపోయేది.

''వెధవకి తిండి పెట్టకు.'' అవధాని తండ్రి అరిచేవాడు. భార్య తలూపేది. కానీ తలుపు చాటుగా కొడుక్కి తినిపించేది. ఆ రోజు అలా తినిపిస్తూ పెనిమిటి కంట పండింది. ఆయన కోపం పట్టలేక వంటింట్లో కడిగి బోర్లించిన ఇనుప కుంపటిని కాలితో తన్నాడు. అన్నం విస్తరిని





గొట్టంలాగా చుట్టి పశువుల పాకలోకి విసిరేశాడు. జుట్టు పట్టుకొని పెళ్లాన్ని, చొక్కా పట్టుకొని కొడుకుని గోడకేసి కొట్టాడు. తనకి అన్నం పెట్టి దెబ్బలు తిన్న అమ్మని చూస్తే దుఃఖం, తానింకా బతికే వున్నందుకు ఉక్రోషం అవధానిలో పొడుచుకొచ్చాయి.

''రైలు కింద తలపెడతాను'' జీవితంలో మొదటిసారిగా తండ్రికి ఎదురు తిరిగాడు అవధాని.

''అయ్యో! వద్దని చెప్పండీ'' అంటూ తల్లి ఏడ్చింది. అప్పటికే అవధాని గాల్లో ఎగిరిపోయిన పండుటాకులాగా రైల్వే ప్లాట్‌ఫారమ్మీదకి వచ్చి పడ్డాడు. కాలికి అడ్డంగా వచ్చిన ఖాళీ సిగరెట్ పెట్టెల్ని తన్నుకొంటూ, దారిపక్క ఏపుగా ఎదిగిన పిచ్చి మొక్కల్ని పీకి పారేస్తూ, ప్లాట్‌ఫారం చివరికొచ్చాడు అవధాని. అక్కడ ఇనుప కంచెకి అవతల రావి చెట్టు కింద సూదులు, సవరాలూ అమ్ముకొనే వాళ్లు, కోతులు ఆడించుకునే వాళ్లూ అరుచుకుంటున్నారు. అవధాని తలెత్తి రైలు పట్టాలు మలుపు తిరిగిన చోట చూశాడు. దూరంగా ఎక్కడో అన్నం ఉడుకుతున్నప్పుడు గిన్నె మీద తపేలా చప్పుడు లాంటిది వినిపిస్తోంది. గాల్లో నల్లచీర పీలికలు గిరికీలు కొడుతున్నట్లు పలచని పొగ శూన్యంలో రాక్షస లిపి రాస్తోంది.

ప్లాట్‌ఫారమ్ దిగాడు అవధాని. పట్టాల పక్క దిగుడు తోవలో నడిచాడు. మరో పది అడుగుల్లో పాత స్లీపర్లు గోడలాగా పేర్చి వున్నాయి. అక్కడ నిలబడి–

''రైలు కింద తలపెడతాను. పెట్టాల్సిందే తప్పదు'' అనుకున్నాడు.

పొగబండి సైట్ అయింది. పట్టాల మీద వంగాడు అవధాని. రెండు చేతులూ వెనక్కి వంచి మెడని పట్టాల మీద ఆన్చాడు. పొగబండి ఇనుప చక్రాల ప్రకంపనలు అతనికి కంఠంలోని నరాల్ని తాకుతున్నాయి. కళ్లు మూసుకున్నాడు. గిన్నె అట్టడుగున అన్నం కరడుని పైకి తీసిన అమ్మ చెయ్యి, ఆవిడ వేళ్లనిండా మెతుకులు అవధాని కనురెప్పల్లో గూడుకట్టాయి. సెకన్ల కాలం..అతనికీ ఇంజన్‌కీ మధ్య. బ్రేక్ వేసేంత దూరం... స్టీమ్ ఇంజన్ డ్రైవర్ ఆ కాలాన్నీ, దూరాన్ని అందిపుచ్చుకున్నాడు. ఇనుప చక్రాలూ, పట్టాలూ ఒరుసుకున్నాయి. నిప్పు రవ్వలు పెద్ద చప్పుడూ ఒకేసారి పుట్టుకొచ్చాయి. రైలు ఆగింది.

ఇద్దరు ఫైర్‌మెన్లు ఇంజన్‌లోంచి గెంతారు. కరకుగా ఉన్న చేతులతో అవధాని చెరో జబ్బనీ పట్టుకొని ఎత్తి అవతల పడేశారు. కింద పడ్డ అవధానిని ఎడాపెడా వాయించబోయారు.

''స్టాప్...స్టాప్ ఐసే..'' డ్రైవర్ ఫ్రెడరిక్స్ వారించాడు. లైనుమెన్లు అవధాని వైపు కొరకొర చూస్తూ, గట్టిగా తిడుతూ ఇంజన్‌లోకి వచ్చారు. ఇంజన్ ఈల వేసింది. మెల్లగా కదిలింది. అంతలోనే ''సార్... డ్రైవర్ సార్'' అంటూ కేక వినిపించింది. స్పీడ్ అందుకొన్న ఇంజన్‌లోకి ఎక్కేందుకు ప్రయత్నిస్తూ అవధాని.... ఫుట్‌ప్లేట్ రాడ్‌ని పట్టుకొని వేలాడుతున్నాడు.

''మై గుడ్‌నెస్..'' ఫ్రెడరిక్స్ గట్టిగా అరిచాడు. ఓచేత్తో ఇంజన్ వేగాన్ని నియంత్రిస్తూ, మరో చేత్తో అవధానిని కొక్కేనికి తగిలిన చేపలాగా గబుక్కున పైకి లాగేశాడు.అలా ఇంజన్‌లోకి వెళ్లిన అవధాని డ్రైవర్ ఫ్రెడరిక్స్ సాయంతో రైల్వేలో చేరాడు. లోకో షెడ్‌లో కళాసీగా ఇంజన్లు తోమాడు. గ్రీజు ముద్దలు పులిమాడు. బొగ్గులు కొట్టాడు. ఫైర్‌బాక్స్ వెలిగించడం నేర్చుకున్నాడు. ఫైర్‌మెన్‌గా పనిచేసి, డ్రైవర్ స్థాయికి చేరుకున్నాడు.

ఆ రోజుల్లోనే ఫ్రెడరిక్స్ చొరవ తీసుకున్నాడు. అవధానిని, అతని కుటుంబాన్నీ కలిపాడు. అప్పటికే అవధాని తండ్రి చనిపోయాడు. తల్లి పక్షవాతంతో మంచాన పడింది. ఆవిడ మతికూడా భ్రమించింది. అమ్మని తనతో తీసుకొచ్చాడు అవధాని. ఇద్దరు చెల్లెళ్లకి పెళ్లిళ్లు చేశాడు. నలభయ్యవ ఏట పెళ్లి చేసుకున్నాడు.

అవధాని తల్లి ప్రతిరోజూ కలవరించేది.

''మా అబ్బి రైలు కింద తలపెడతానని వెళ్లేడు.. వెళ్లండి.. వెంటనే తీసుకురండి'' అంటూ మంచానికి బల్లిలా అంటుకొని ఏడ్చేది. 'మా అబ్బిని తీసుకు రా బాబూ' అంటూ అవధానిని పట్టుకొని గట్టిగా కుదిపేసేది. అలా కలవరిస్తూనే ఓ రాత్రి కన్నుమూసింది.

అవధాని ఇంజన్ నడుపుతున్నప్పుడు రైలు దారిలో అలాంటి దృశ్యాల్ని ఎన్నో చూశాడు. లైన్ క్రాస్ చేస్తూ ఆవులూ, గేదెలు చక్రాల కింద పడ్డప్పుడు అవధాని తెగ బాధపడేవాడు. చీకట్లో ట్రాక్ పక్క కాలకృత్యాలు తీర్చుకుంటున్నట్లు నటించి, హఠాత్తుగా రైలు కింద తలపెట్టిన వృద్ధుల్ని, యువకుల్నీ శవాలుగా చూసినప్పుడు ఫ్రెడరిక్స్ తనని కాపాడిన దృశ్యమే గుర్తుకొచ్చేది. ఫ్రెడరిక్స్‌కి కృతజ్ఞతలు చెప్పుకుంటూ హత్యా దోషాన్ని మూటకట్టుకొన్నందుకు తనిని తానే నిందించుకునేవాడు.

***

''శ్రీమాన్‌జీ...'' బ్రహ్మ కపాలంలో పిండ ప్రదానం చేయిస్తున్న ఉత్తరాది పండిట్‌జీ చదువుతున్న మంత్రాన్ని ఆపి....

''మీ పితృదేవతలందరికీ పిండ ప్రదానం జరిగింది. ఇంకా మూడు పిండాలు మిగిలి వున్నాయి. మీ జీవితంలో అత్యంత ఆప్తులైన వారికి జాతి, కులం, మతం అని చూడకుండా వాటిని సమర్పించవచ్చు'' అంటూ హిందీలో చెప్పాడు.

అవధాని ఆకులోని మొదటి పిండాన్ని– డ్రైవర్ ఫ్రెడరిక్స్‌కీ... రెండో పిండాన్నీ తన ఇంజన్ కింద పడి ఖండాలైపోయిన మూగజీవాలకీ.... మూడో పిండాన్ని రైలు కింద తలపెట్టి కష్టాలు గట్టెక్కాయని భ్రమపడి ఆకలిదప్పులతో అలమటిస్తున్న ఆత్మలకీ సమర్పించాడు.

వాటిని అలకనందాలో విడిచి అవధాని నమస్కరిస్తుంటే నరనారాయణ పర్వతాలు సాక్షుల్లాగా నిలబడ్డాయి. వాటి భుజాల మీద కండువాల్లో వేలాడిన మబ్బులు కరిగి వర్షించాయి. అవధాని చెక్కిళ్ల మీద కన్నీళ్లతో పాటు కలిసిపోయాయి.

◆

## హీరోయిన్ నుండి ఐటమ్ గర్ల్ దాకా...

హీరోయిన్ల స్థానం నుండి ఐటమ్ గర్ల్ స్థానానికి దిగిపోయిన తారల్లో మరో పేరు చేరింది. సాక్షి శివానంద్ గుర్తుందా? 'మాస్టర్' సినిమాలో మెగాస్టార్ చిరంజీవి సరసన తెరంగేట్రం చేసింది. తరువాత చాలా సినిమాల్లో గ్లామరస్ పాత్రలు చేసింది. కానీ అదే ఉరవడిలో పోతూ నటనకు అవకాశం ఉన్న ఏ పాత్రా ఎంచుకోకపోవడం వల్ల తన లాంటి చాలా మంది హీరోయిన్ల లాగే చివరకు తెరమరుగైపోయింది. ఇటీవల 'హోమం'లో ఒక ఐటమ్ సాంగ్‌లో తన పాత స్నేహితుడు, ఆ చిత్ర దర్శకుడూ అయిన జె.డి. చక్రవర్తి కోరిక మేరకు నర్తించింది. ఆ సినిమా ఓ మోస్తరు విజయాన్ని సాధించటంతో మళ్ళీ అందరి కళ్ళూ సాక్షి మీదకు మళ్ళాయి. ఆమె కూడా 'హీరోయిన్‌గా మాత్రమే' అంటూ మడికట్టుకు కూర్చోక దొరికిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో పడింది. ప్రస్తుతం ఐటమ్ సాంగ్‌కు ఆరు లక్షలు చొప్పున డిమాండ్ చేస్తోందట.

